జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 16 జూన్ 2025
www.ntnews.com




# రుక్మిణీ కల్యాణం-2




శుకుడు పరీక్షిత్తుతో... మానవనాథా! దద్దన్న (వ్యర్థుడు) ఐన తన పెద్దన్న- రుక్మి చెడు తలపు గ్రహించి అన్నవ నీరజగంధి- కొత్త తామరల నెత్తావులు- సుగంధాలు విత్తు (వెదజల్లు) ఆ వైదర్భి- రుక్మిణి రానున్న ఆపదను తలచి మదిలో కడు ఆపన్నత- బాధపడ్డది. తన హితం కోరే ఆప్తుని, భాగవతోత్తముని అగ్నిద్యోతనుడను ఒక బ్రాహ్మణుని పిలిపించు కొని ఇలా ప్రార్థించింది. 'ఓ విద్వన్మణీ! గర్వంతో కన్నులు గానక నా పెద్దన్న, పెద్దలందరూ వద్దన్నా వినక నన్నిప్పుడు బాలిశు- మూర్ఖుడైన శిశుపాలునికి కట్టబెట్టనున్నాడు! ఎట్టి పరిస్థితిలోనైనా నీవు ద్వారక వెళ్లి పన్నగశాయి- వెన్నునికి నా అసహాయతను విన్న వించు. అయ్యా! నా అయ్య- తండ్రి కూడా తన తనయుని ఆలోచన తగదని తెగబడి- సాహసించి చెప్పలేకున్నాడు. మా అన్న ఆటలు సాగకుండా నీవు వేగంగా వెళ్లి, తన భక్తుల చిత్త వృత్తి ననుసరించి నడచుకునే హరికి నా ప్రణయ వృత్తాంతం ఎరిగించి ఇచ్చటికి పిలుచుకు రావాలి' ఇలా అని ఆ మానిని మరికొన్ని రహస్యపు మాటలు ఆ మహీదేవునికి చెప్పింది.



అగ్నిద్యోతనుడు (జ్ఞానాగ్నితో దేదీప్యమానంగా ప్రకాశించువాడు- బ్రహ్మజ్ఞాని) శరవేగంతో ద్వారకాపురి చేరి, తన రాక వార్తాహరుల ద్వారా హరికి ఎరిగించి, గిరిధారి నివసించే నగరి- భవనంలోని కరిగి- ప్రవేశించి అందు బంగారు గద్దెపై నయగారా- అలంకారాలతో రంగారు (ఒప్పుచున్న) శృంగార రత్నాకరుని శౌరిని దర్శించాడు. 'వరుడు'- పెండ్లికుమారుడవు కమ్మని ఆ గరుడ గమనుని విప్రవరుడు ఆశీర్వదించాడు. ధరామరు- బ్రహ్మణులను దైవంగా భావించే ఆ మురారి తన బ్రహ్మణ్యతను- బ్రాహ్మణ ప్రియత్వాన్ని ప్రదర్శిస్తూ, ముసిముసి నవ్వులు నవ్వుతూ గ్రద్దన- తటాలున తన గద్దె దిగి, అతణ్ని తన ఆసనంపై కూర్చుండజేసి, అమరులు తనను ఆరాధించునట్లు తాను ఆ ధరామరుని అర్చించాడు. ఇష్ట మృష్టాన్నం- షడ్రుచులతో కూడిన కమ్మని భోజనం పెట్టించి సంతుష్టుని చేశాడు. అంతట, రెట్టించిన ప్రేమతో వసుదేవు పట్టి వాసుదేవుడు ఆ భూసురోత్తముని చెంతకు చేరి, జగద్రక్షణలో ప్రశస్తమైన- ఆరితేరిన తన హస్తంతో అతని పాదాలు ఒత్తుతూ నెమ్మదిగా ఇలా పలికాడు...

**సీ|| 'జగతీసురేశ్వర సంతోష చిత్తుండ**
**వైయున్న నీ ధర్మమతి సులభము**
**వృద్ధ సమ్మతమిది విత్తమెయ్యది యైన**
**బ్రాపింప హర్షించు బ్రాహ్మణుండు**
**తన ధర్మమున నుండు దరలడాధర్మంబు**
**గోరికలతనికి గురియుచుండు**
**సంతోషిగాడేని శక్రుడైన నశించు**
**నిర్ధనుండైనను నిద్రవోవు'**
**ఆ|| 'సంతసించే నేని సర్వభూత సుహృత్త**
**ములకు బ్రాప్తలాభ ముదిత మాన**
**సులకు శాంతులకును సుజనులకును గర్వ**
**హీనులకును వినతులేనొనర్తు'**

భూసురోత్తమా! నీ మానసం భాసురం- భక్తి జ్ఞాన వైరాగ్యాలతో ప్రకాశవంతం. కనుకనే నీవు నిత్య సంతోషివి. దుర్లభమైన సత్య సనాతన ధర్మం నీకు సులభమయింది. అనగా, ధర్మాచరణం కష్టతరం. ఐనా ఇష్టపూర్వకంగా, నిష్ఠతో శ్రమలేకుండా నీవు ఆచరిస్తున్నావు. నీ ధర్మ ప్రవర్తనం ఆదర్శప్రాయం. ఇది ఆర్యులకు- వృద్ధులకు కూడా ఆమోదయోగ్యమైన పద్ధతి. స్వల్పమైన విత్తం సంప్రాప్తమైనా పూర్ణ సంతృప్తి పొందే అల్ప సంతోషి విప్రుడు. ఎట్టిస్థితిలో కూడా ఎన్ని కష్టాలు చుట్టుముట్టినా పట్టిన ధర్మాన్ని తుదముట్ట పాటిస్తాడే తప్ప వట్టిపోయే- వ్యర్థమయ్యే విధంగా వదిలిపెట్టడు. ఆ ధర్మమే కామధేనువై అతని కోరికలన్నీ తీరుస్తుంది. తృప్తి అనేది లేని యెడల ఇంద్రుడైనా నశిస్తాడు. విత్తహీనుడైనా సంతృప్త చిత్తుడైతే సురపతి- ఇంద్రునితో సమానుడౌతాడు- వంత లేక నిశ్చింతగా నిదురిస్తాడు. సర్వజీవుల హితం కోరువారు, ఒనగూరిన దానితో మనగలమని సరిపెట్టుకొని సంతసించే స్వాంతం- మనస్సు గలవారు, శాంత స్వభావులు, గర్వహీనులు ఐన సజ్జనులు నాకు ఒజ్జలు (గురువులు). నేను వారికి తలవంచి నమస్కరిస్తా.

ప్రస్తావకం- సందర్భోచితంగా పరమాత్మ ఇచ్చట ధర్మం- విశేషంగా బ్రాహ్మణ ధర్మం ప్రాశస్త్యాన్ని ప్రకటించి ప్రశంసించాడు. సంతుష్టి- తృప్తి అనేది విప్ర ధర్మానికి విశిష్ట లక్షణం. 'అసంతుష్టో ద్విజో నష్టః సంతుష్ట ఇవ పార్థివః'- విత్తంతో సంతృప్తి పొందే భూపాలకుడు- రాజు, సంతుష్టుడు కాని భూసురుడు, ఇద్దరూ నష్టపోతారని నీతిశాస్త్రం. 'కోవా దరిద్రోహి విశాల తృష్ణః'- దురాశాపరుని మించిన దరిద్రుడు లేడు. 'శ్రీమాంశ్చకో యస్య సమస్త తోషః'- సంతృప్తి కలవాని కన్న శ్రీమంతుడు లేడు అని ఆదిశంకరుల సుభాషితం.

శుకుడు- రాజా! పరమాత్మ ఇంకా ఇలా ప్రశ్నించాడు... 'ప్రజ్ఞానిధీ! నీవు ఏ దేశపువాడవు? మీ రాజ్యమేలే ప్రభువు మీ యోగక్షేమాలను బాగా విచారిస్తున్నాడా? పాలితులను- ప్రజలను అన్ని విధాల సుఖపెట్టే ప్రభువే నాకు అత్యంత ప్రియుడు. అదిసరే కాని, సాగర మధ్యంలో ఉన్న మా కోటలోనికి నీవెలా వచ్చావో! ఇది మాకు చాలా అచ్చెరువు- ఆశ్చర్యంగా ఉంది. ఇచ్చకపు మాటలు కావు. నీ ఇచ్ఛ- మనోవాంఛ ఏమిటో తెలుపు. తప్పక తీరుస్తా! ఇలా లీలామానుష విగ్రహుడైన గోపాల కృష్ణుడు పలుకగా అగ్నిద్యోతనుడు చాలా అడకువ- వినయంగా ఇట్లా అన్నాడు- దేవా! మాది విదర్భ దేశం. మా ప్రభువు భీష్మకుడు. ఆయనకు 'రుక్మిణి' అను ఒక కన్యకామణి ఉన్నది. ఆ ఇందువదన- సుందరి నిన్ను సేవింప కోరుతోంది. ఇందిరా మందిరా! ఆనంద మంగళకరమైన వివాహ శుభ సందేశం మీకు విన్నవించమని నన్ను మీ పాలికి పంపింది. గోపాల దేవా! ఆలించు...

**సీ|| 'ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోక**
**దేహతాపంబులు దీరిపోవు**
**నేనీ శుభాకార మీక్షింప గన్నుల**
**కఖిలార్థలాభంబు కలుగుచుండు**
**నేనీ చరణసేవ లేప్రొద్దు జేసిన**
**భువనోన్నతత్వంబు బొందగలుగు**
**నేనీ లసన్నామ మేప్రొద్దు భక్తితో**
**దడవిన బంధ సంతతులు వాయు!'**

**తే|| 'నట్టి నీయందు నా చిత్తమనవరతము**
**నచ్చియున్నది నీ యాన నానలేదు**
**కరుణ జూడుము కంసారి ఖలవిదారి**
**శ్రీయుతాకార! మానినీ చిత్తచోర!'**

సంసారవైరీ! ఓ కంసారీ! సర్వజ్ఞత్వం, సర్వేశ్వరత్వం, సర్వశక్తిమత్వం, సర్వాంతర్యామిత్వం ఇత్యాది ప్రశస్తాలైన నీ కల్యాణ గుణాల ప్రశంసలు చెవులకు సోకితే చాలు, శరీర తాపాలు శమిస్తాయి- తొలగిపోతాయి. దుష్ట సంహారా! దర్శనీయతమమైన నీ దివ్యమంగళ గాత్రం- స్వరూపం తిలకిస్తే చాలు, మనస్సు పులకించి కన్నుల కరవు తీరిపోతుంది- నేత్రాలున్నందుకు పాత్రత సిద్ధించి అన్ని అర్థలాభాలూ చేకూరుతాయి. 'అఖిలార్థ లాభం'- చతుర్విధ పురుషార్థ ప్రాప్తి! ధర్మార్థ కామ మోక్షాలు నాలుగూ సారసాక్షుని, నారసింహుని- పురుషోత్తముని ప్రతిరూపాలే కనుక. త్రిభువనాలలో మందరగిరి ధరుని- మాధవుని కన్నా సుందర రూపుడున్నాడా? లేడు. కారణం? లోకంలో గుణముంటే రూపం ఉండదు. రూపముంటే, పాపం! గుణం ఉండదు. అదృష్టం కొద్దీ ఈ రెండూ అమరినా, అమృతత్త్వం- చావులేనితనం అస్సలు ఉండదు. అచ్యుతుని యందు మృతి- వినాశనం గాని, తత్కారణం గాని లేనందున ఆయన 'సత్యం, శివం, సుందరం'- అమృత స్వరూపుడు. కృష్ణుని చూడగానే ఆవులు గడ్డి తినడం మానేవి, నదులు పొంగేవి, మేఘాలు గర్జించి వర్షించేవి, రాళ్లు కరిగేవి. జనార్దనుడు అట్టి జగన్మోహన రూపుడు!

శ్రీయుతాకారా! కల్యాణ స్వరూపా! అనవరతమూ నీ చరణ సేవలు చేయువారికి, ఈ భువనం- లోకంలో మహోన్నత స్థితి- అలోకమైన వైకుంఠలోకం ప్రాప్తిస్తుంది. మానవతీ మనోహరా! నిన్ను నిరంతరం ధ్యానించేవారి- సంతతం నీ దివ్యనామం భక్తితో స్మరించేవారి సంసార బంధాలు అన్నీ నీ కటాక్ష వీక్షణంతో పటాపంచలవుతాయి. అహి (కాళియ) మర్దనా! నీ మహిమ ఎక్కడ? ఈ మహీ (భూ) మండలంలోని మహిళా మండలిలో ఒకతెనైన నేనెక్కడ? 'గూఢో గభీరో గహనః'- జ్ఞాన, ఐశ్వర్య, బల, వీర్యాది గుణాలచే మీరు మహా గంభీరులు. కాన, ముందుగా ప్రస్తావించరు, స్పందించరు- బయటపడరు. కాని, మీ సౌందర్య, ఐశ్వర్య, మాధుర్య లీలాశ్రవణం చేసి చేసి నా డెందం సిగ్గు చెందక, ఓ ఆనందమయా! నిరంతరం నీయందే, నచ్చి- లగ్నమైయున్నది. నేను నిక్కచ్చి- నిష్కర్షగా చెబుతున్నా. ఇది పచ్చి నిజం. సచ్చరితా! దయతో వచ్చి నన్ను స్వీకరించండి' భగవన్నుతితో భాసమానమగు ఈ సీస పద్యపు వాసి- సొంపు, సౌందర్యం, మహత్తు అంతా భావుక భక్తుల చిత్తాలను గమ్మత్తుగా, చమత్కృతం- చిత్తు చేయగల దాని ఎత్తుగడ (ఏ నీ గుణములు, ఏ నీ శుభాకారము.. అట్టి నీ యందు)లో ఉంది. మూల శ్లోకంలో 'నిర్విశ్య కర్ణ వివరైః' (కర్ణ రంధ్రాల ద్వారా లోపలికి ప్రవేశించిన నీ గుణాలు) అని ఉండగా, 'కర్ణేంద్రియంబులు సోక' (చెవులకు తగిలితే, తాకితే చాలు) అంటూ మూలానికి చాలా వన్నె తెచ్చాడు అమాత్యుడు పోతన్న. ఇలాంటి జిలుగు- నగిషీ పోకడలు (చేష్టలు) తెలుగు భాగవతంలో ఎన్నో!

(సశేషం)



తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

# బంధన కారణాలను గుర్తించాలి..

**త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః**
**కామఃక్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్!**
(భగవద్గీత 16- 21)

'అర్జునా! కామక్రోధ లోభాలనే మూడు నరకానికి ద్వారాలు. అవి ఆత్మనాశన హేతువులు. అంటే మానవుని అధోగతి పాలుచేసేవి. కాబట్టి ఆ మూడింటిని త్యజించాలి' అంటున్నాడు కృష్ణపరమాత్మ. మానవులకు కామం (కోరికలు) సహజం. అవసరాలు పరిమితాలు, కోరికలు అపరిమితాలు. కోరికలు తీరకపోతే క్రోధం, దానినుంచి లోభం, లోభం నుంచి మోహం, మోహం నుంచి మదం, దాన్నుంచి మాత్సర్యం వెలుగుచూస్తాయి. వీటిని ఆసురీ ప్రవృత్తులుగా చెబుతారు. నిరంతర వేదనామయ జీవితానికి ఇవి మూలకారకాలు. కాబట్టి వీటిని నరక ద్వారాలని అంటారు.

భాగవతంలో గజేంద్రమోక్షణ గాథ ఉన్నది. గజరాజు తన భార్యలతో ఒక సరోవరంలో జలక్రీడలు ఆడుతుండగా మొసలి దానిని పట్టుకుంటుంది. తన భౌతిక శక్తి సామర్థ్యాలతో మొసలిని జయించలేని గజరాజు విష్ణువును ప్రార్థించగా.. విష్ణువు మొసలిని సంహరించి గజరాజును రక్షిస్తాడు.
గజరాజు అనేది మనసును ఆవరించిన కోరికలకు ప్రతీక. అపరిమితమైన కోరికలు ఒకదాని వెంట మరొకటి చెలరేగగా వాటిని సంతృప్తి పరచలేక/ జయించలేక, నిస్సహాయత, కోపంలాంటి నకారాత్మక భావనలు అశాంతికి గురిచేయగా.. ఆ సమస్య పరిష్కారానికై తీవ్రంగా ప్రయత్నించాడు. తీవ్రమైన కోరికల ఉధృతివల్ల 'మొసలి' అనే బంధనాలలో చిక్కాడు. కోరికల వలయంలో చిక్కిన తాను వాటిని జయించలేనన్న సత్యాన్ని అవగతం చేసుకున్న గజరాజు, సంఘర్షణ పరిష్కారాన్ని చూపదనే 'యెఱుకను' పొంది మరొకరి సహాయానికై ప్రార్థించాడు. సంఘర్షణ పరిష్కారాన్ని వ్వదు. విశ్వాసంతో కూడిన సంస్కారం, శక్తిసామర్థ్యాల సంపూర్ణ వినియోగం మాత్రమే సమస్యలను పరిష్కరిస్తుంది. విశ్వాసం విష్ణువుకు ప్రతీక.

గజరాజు ఆ సందర్భంలో తనను తానొక బాధితుని గానూ, మొసలిని దుర్మార్గురాలిగానూ భావించాడు. నిజానికి గజరాజు బాధితుడూ కాడు, మొసలి దుర్మార్గురాలూ కాదు. తానొక గజరాజుననే అహంకారం, తనకందరూ భయపడతారనే భావన అతనిలో ఆభిజాత్యాన్ని పెంచింది. తన ప్రయత్నంలో గెలిస్తే తానొక ఉదాత్త చరిత్రుడయ్యేవాడు.. ఓడితే అమరవీరుడయ్యేవాడు. ఈ రెండూ నిజానికి మాయ, మోహ, మద భావనలకు సంబంధించినవే. అయితే.. ఆ భావనల పరిమితులను అధిగమించి, విశ్వాసంతో విష్ణువు సహాయానికై ప్రార్థించాడు.

నిజానికి అన్ని సమస్యలను మనమే పరిష్కరించుకోగలమనే నమ్మకంతో బాధ్యతను తీసుకుంటాం. పరిష్కారాలకై పరిశ్రమిస్తాం. జయాపజయాలు సంభవిస్తాయి. పొంగిపోయినా, కుంగిపోయినా వ్యక్తిత్వంపై మరకపడుతుంది. సముద్రంలో అలలు తీరాన్ని తాకి తిరిగి సముద్రంలోకి ఎలాగైతే వెళ్లిపోతాయో... అలాగే సమస్యలు చుట్టుముడుతాయి, కాలాంతరంలో తొలగిపోతాయి. పరిష్కరించుకోగలిగిన వాటిని పరిష్కరించుకోవడం.. సాధ్యపడని వాటిని విశ్వాసంతో భగవంతుడికి అప్పగించడం విజ్ఞత.

యాంత్రికమైన ప్రక్రియలతో ఒక్కోసారి ఫలితాలు రావచ్చు. కాని అవి అస్థిరమైనవే. ఆకర్షణ వలయంలో విశ్వాసంతో సాధించిన ఫలితాలే స్థిరంగా నిలుస్తాయి. విశ్రాంతమైన శరీరంతో, సంఘర్షణను పొందని మనసుతో, ఏకాగ్రమైన దృష్టితో చేసిన సాధన నరక ద్వారాలకు దూరం చేస్తుంది.

గీతాసారం




కోరికలు ఒక విష వలయంలాగా మనలో నిండిపోతాయి. వాటిని అదుపు చేసుకోగలగడం సాధన. మానవ ప్రయత్నం సరిపోని సమయంలో భగవంతుడి సహాయానికై ప్రార్థించడమూ సమంజసమే. అయితే వాటిలో ఏవి అవసరమో ఏవికావో తెలుసుకోవడం విజ్ఞత. మనం కోరిన కోరికలు భగవంతుడు తీరుస్తే అద్భుతమని భావిస్తాం. మనలాగే భగవంతుడూ మనలను కోరుకుంటాడు.. ఆ కోరికలను మనం తీర్చగలిగితే అదీ అద్భుతమే. యాంత్రిక వలయంలో జీవించే మానవులకు భయం కారణంగా కామమనేది జనిస్తుంది. మూలకారణమైన కోరికలను అదుపు చేయగలిగితే.. యాంత్రిక వలయం నుంచి భగవంతుడి ఆకర్షక వలయంలోకి చేరుకుంటాం. సత్యాన్ని దర్శించ గలుగుతాం.

.. పాలకుర్తి రామమూర్తి

క్రీస్తు సందేశం

# జీవజల దాత




అది గలెలియా ప్రాంతం. సుఖారను ఊరు. ఊరి వెలుపల ఒక బావి. గ్రామంలోని స్త్రీలు ఆ బావి దగ్గరికి వచ్చి నీళ్లు తోడుకొని వెళ్తుండేవారు. ఓసారి అదే ప్రాంతంలో తిరుగాడుతూ అలసిపోయిన ప్రభువు ఆ బావి దగ్గర కూర్చుండిపోయాడు. అంతలో ఒక సమరయా స్త్రీ కూడా అక్కడికి వచ్చింది. దాహంతో ఉన్నాడేమో ప్రభువు ఆ స్త్రీని 'కాస్త నీళ్లు ఇవ్వమ్మా' అని అడిగాడు. ఆమెలో సహజంగా మాతృ హృదయం ఉప్పొంగినా, తన హీన దీన స్థితి గుర్తొచ్చి, తమను ఆనాటి సంఘం బహిష్కరించడం వల్ల కాస్త సందేహించింది. 'మేము సమరేయులం. నీవు చూస్తే యూదుడవు. మమ్మల్ని నీళ్లు ఇవ్వమని అడగడం భావ్యమా ప్రభూ!' అని ఉన్నమాటే అన్నది. అందుకు ప్రభువు 'తల్లీ! నువ్విచ్చే ఈ నీళ్లు తాగితే మళ్లీ మళ్లీ దాహం అవుతుంది. కానీ నేనిచ్చే ఈ జీవజలం ఒక్కసారి తాగితే చాలు దాహానికి తావు లేదు' అంటాడు ప్రభువు. అందుకామె 'అయితే, ఆ నీళ్లు నాకు అనుగ్రహించు' అని కోరింది. ఆమెకు ఈ జీవజలాన్ని ప్రసాదించాడు ప్రభువు. ఆమె గతాన్నీ దర్శించి ఆత్మీయంగా పలకరించాడు. ఆ మహిళపట్ల ప్రభువు చూపిన కరుణ కేవలం ఆమెకు మాత్రమే వర్తించేది కాదు, విశ్వజనులందరికీ సుమా!! ఇదే ప్రభు ప్రేమలోని విశ్వజనీనత!!!

.. ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024

# మసీదులు సామాజిక కేంద్రాలు

ఇస్లాం బోధ



ఇస్లాం ప్రకారం మసీదు కేవలం ప్రార్థనా స్థలం మాత్రమే కాదు. అదొక ఆధ్యాత్మిక, మానసిక, సామాజిక, రాజకీయ శిక్షణల కేంద్రం. అందుకే ఆనాడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహివసల్లం మదీనాలో హిజ్రత్ చేసిన తర్వాత మసీదు నిర్మాణానికి తొలి ప్రాధాన్యం ఇచ్చారు. మంచి సమాజ నిర్మాణం కోసం, ప్రజల అవసరాలు తీర్చడానికి, ఉమ్మత్ (ముస్లిం సమాజం) బాధలకు పరిష్కారాలు సూచించే సజీవ కేంద్రాలుగా ఆనాడు మసీదులు వెలుగులీనాయి. ముస్లిమేతరులు కూడా ఆనాడు సమస్యల పరిష్కారం కోసం అక్కడికి వచ్చేవారు. మసీదులను నమాజ్‌కు పరిమితం చేయకుండా, మళ్లీ సమాజంలోని అన్ని రంగాల అభివృద్ధికి కేంద్రాలుగా మలచాలి. ఆధ్యాత్మిక నిలయంగానే కాకుండా సామాజిక శక్తి, సాంస్కృతిక చైతన్యం మసీదుల ద్వారా పెరిగేలా చూడాలి. నేడు ఉమ్మత్ ముందున్న పెద్ద సవాళ్లలో ఇది ప్రధానమైనది. దీనికి వ్యూహాత్మక దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. మరోవైపు మహిళలు మసీదులకు వెళ్లడానికి ప్రవక్త అనుమతించారు. స్త్రీలు మసీదులకు వెళ్లకూడదని ఖురాన్‌లోనూ ఎక్కడా ప్రస్తావించలేదు. మహిళలు మసీదుకు వెళ్తుంటే ఆపొద్దని, రాత్రి వేళల్లోనూ వారిని మసీదులోకి అనుమతించాలని ఓ హదీసు చెబుతున్నది. మహిళలు వినయంతో, ధార్మిక చింతనతో మసీదుల్లో ప్రార్థనలు చేయాలని ఖురాన్ బోధిస్తున్నది. ఈ నేపథ్యంలో మసీదుల్లో మహిళలు నమాజులు చేసేందుకు తగిన సౌకర్యాలు ఏర్పాటుచేయాలి.

.. ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

# రెండు ఎందుకంటే..

ధర్మ సందేహం

**గ్రామదేవతల ఆలయానికి వెళ్లినప్పుడు జంట (రెండు) కొబ్బరికాయలు కొట్టాలంటారు ఎందుకు?**
• **భవాని,** భువనగిరి

**గ్రామదేవతలను** కొలిచే ఆచారం ప్రాచీనకాలం నుంచి ఉన్నది. గ్రామదేవతలు అంటువ్యాధుల నుంచి ఊరిని కాపాడుతూ, పాడిపంటలు అనుగ్రహిస్తూ ఉంటారని ప్రజలు విశ్వసిస్తారు. పొలిమేరలో కొలువుదీరిన గ్రామదేవతలు ఊళ్లోకి ఏ దుష్టశక్తులూ రాకుండా కాపుకాస్తాయని నమ్ముతారు. అందుకే, ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా ముందుగా గ్రామదేవతలను పూజించే సంప్రదాయం ఉన్నది. అమ్మవారి దర్శనానికి వెళ్లినప్పుడు రెండు కొబ్బరికాయలు కొట్టే ఆచారం ఉంది. సహజంగా గ్రామదేవతలు ఉగ్రమూర్తులు. ఈ దేవతలు ఎక్కువ దాహం, ఆకలి కలిగి ఉంటారని భావిస్తారు. అందుకే మద్య, మాంసాదులను అమ్మవారికి నివేదనగా సమర్పిస్తుంటారు. కొబ్బరికాయ విషయానికి వస్తే, ఆ దేవతలను తృప్తి పరచాలనే భావనతో రెండు కాయలను కొట్టి నైవేద్యం పెడతారు. అయితే, ఒక్క కొబ్బరికాయ కొట్టినా దోషం కాదు.

# రాగి బిందె..

కథాసుధ



ఊరి పెద్దలు రాములవారి గుడి దగ్గర మహాభారతం ప్రవచనం చెప్పిస్తున్నారు. వాటి కరపత్రాలను పంచే పనిని చురుకైన ఒక యువకుడికి అప్పగించారు. ఆ యువకుడు వీధులన్నీ తిరిగి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి అందరూ తప్పక రావాలని కోరాడు. చివరిగా ఒక ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆ ఇంటావిడ పాత్రలు కడుగుతున్నది. యువకుడు వెళ్లి ఆమెకు విషయం చెప్పాడు. 'మన ఊర్లో ఎప్పుడూ చెప్పేదే కదా మహాభారతం. వినివినీ విసుగొచ్చేసింది' అని చెప్పి కరపత్రం చేతిలోకి తీసుకోలేదు. ఆమెకు ఏం చెప్పాలో యువకుడికి అర్థం కాలేదు. ఆమె చేస్తున్న పనిని గమనించాడు. కడిగిన పాత్రల్ని ఎండలో ఆరబెడుతోంది. అందులో ఒక బిందె మిలమిలా మెరుస్తూ కనిపించింది. 'అన్ని పాత్రలూ మామూలుగా మెరుస్తున్నాయి. ఇది మాత్రమే ఎందుకు మిలమిలా మెరుస్తున్నది?' అని అడిగాడు యువకుడు. 'ఇది రాగి బిందె. తిరుపతి వెళ్లినప్పుడు గోవింద రాజస్వామి గుడి దగ్గర కొన్నాం. ఆరోగ్యానికి మంచిదని దీనిలో నీళ్లు పోసుకుని తాగుతాం' అని బదులిచ్చిందామె. 'సంతోషం... అలా మిలమిలా మెరవడానికి కారణం ఏమిటి?' అని అడిగాడు. 'అది కూడా తెలియదా నీకు... దాన్ని చింత పండుతో బాగా రుద్ది కడుగుతాను. అందుకే మెరుస్తున్నది' అని చెప్పింది. 'రోజూ చింతపండు వేసి కడుగుతారా?' అని అడిగాడు. 'చింతపండు వేసి కడగకపోతే మరకలు పోవు!' అని బల్లగుద్ది చెప్పినట్లు చెప్పింది. ఆ యువకుడు మెరుపు ముఖంతో 'మనం రోజువారీ కార్యక్రమాల్లో మునిగిపోయి మంచిచెడ్డలు మరుస్తాం. పాపపుణ్యాలు పక్కనపెడతాం. పాప చింతన తలంపు ఉండదు. అందుకే మన ఊర్లో ప్రతి సంవత్సరం మంచి ఉపన్యాసకులతో మహాభారతం చెప్పిస్తారు. దారి తప్పిన మన మనసు గాడిలో పడుతుందని మన ఊరి పెద్దల నమ్మకం. మహాభారతం ఎన్నిసార్లు విన్నా ప్రతిసారీ మనకు కొత్త విషయం తెలుస్తుంది. అవకాశం వదులుకోకండి. రాగి బిందె మిలమిలా మెరుస్తుందని రోజూ చింతపండు వేసి రుద్దుతారే... లౌకిక వ్యవహారాల్లో మలినమయ్యే మన మనసును ఎంత చింతపండుతో తోమితే శుద్ధి అవుతుంది?' అని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు యువకుడు. 'భారతంలో లేనిది ప్రపంచంలో ఎక్కడా ఉండదు. ప్రపంచంలో జరిగేవన్నీ భారతంలో ఉన్నాయి' అని అర్థం చేసుకుంది ఆ గృహిణి. ఆరోజు సాయంత్రం అందరికన్నా ముందు వెళ్లి మొదటి వరుసలో కూర్చుని భారతం విన్నది.

.. ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821